క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 11 కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌కుమార్ తెలిపారు. బతుకమ్మ కుంట ఫీడర్ పరిధిలో పాముల బస్తీ, మల్లన్న ఆలయం, గంగానగర్, పోచమ్మ బస్తీ, బతుకమ్మ కుంట తదితర ప్రాంతాల్లో 9 నుంచి 11 గంటల వరకు. బౌదనగర్ ఫీడర్ పరిధిలో అమీనాషాప్, కెనరాబ్యాంక్ గల్లీ, ఉస్మానియా యూనివర్సిటీ తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నల్లపోచమ్మ ఆలయంలో చండీహోమం



చండీహోమం చేస్తున్న కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్ దంపతులు

కాచిగూడ: చెప్పల్‌బజార్, ఇందిరానగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణంలో నవగ్రహపూజ, చండీహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లు పద్మ వెంకట్‌రెడ్డి, వై.అమృత, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, కన్నె రమేష్ యాదవ్, సంతోష్ కుమార్, సుభాష్ పటేల్, హజారిబాబు పాల్గొన్నారు.

బిషప్ డాక్టర్ ఆహరోన్ మేడకు క్రైస్తవ సేవారత్న అవార్డు



అవార్డును అందజేస్తున్న ఏకె గిడియోను బాబు

కాచిగూడ: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీ ఎఫ్) 27వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో బిషప్ డాక్టర్ ఆహరోన్ మేడకు క్రైస్తవ సేవారత్న అవార్డును ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఏకె గిడియోను బాబు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిషప్ డాక్టర్ ఆహరోన్ అందిస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయను ఈ అవార్డును బహూకరించినట్లు గిడియోను బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ స్పీకర్ బిషప్ జాషువ మందపల్లి, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు, రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ నారబోయిన, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అబ్రహాం, ప్రధానకార్యదర్శి డాక్టర్ సామ్యుల్ జా న్, ఆర్చ్ బిషప్ ఎంఎస్ దయానంద్ పాల్గొన్నారు.

టీఎంహెచ్ఈయూ ఫీవర్ ఆస్పత్రి శాఖ కార్యాలయం ప్రారంభం



నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఫీవర్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి శాఖ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, టీఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి యూనియన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. యూనియన్‌లు ఏవైనప్పటికీ ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో టీఎంహెచ్ఈయూ ఫీవర్ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్



రొయ్యిరు శేషసాయిని సన్మానిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా గురువారం సంధ్యారవళి కార్యక్రమం టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఇండో కెనడియన్ వ్యవస్థాపకులు, అడిక్‌మెట్ నివాసి రొయ్యిరు శేషసాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంధ్యామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

- అమరవీరులకు ఘనంగా నివాళులు
- తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం
- నియోజకవర్గ వ్యాప్తంగా బైక్ ర్యాలీలు



రాంనగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు గురువారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. చివరి రోజు తెలంగాణ ఉద్యమకారులకు సత్కారాలు, అమర వీరులకు నివాళులు, బైక్ ర్యాలీలు నిర్వహించారు. అమరవీరుల స్మారక భవన ప్రారంభోత్సవ సభకు ర్యాలీగా తరలి వెళ్లారు. అంతకు ముందు రాంనగర్ చౌరస్తాలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించి వారి త్యాగాలను నెమరువేసుకున్న నేతలు నాటి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జైసింహ, నాయకులు రావులపాటి మోజెస్, వై.శ్రీనివాస్, రాకేష్‌కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, నర్సింగ్‌ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, టి.సోమసుందర్, రవియాదవ్, కె.సురేందర్, ముచ్చకుర్తి ప్రభాకర్, గజ్జెల సూర్యనారాయణ, గురుచరణ్‌సింగ్, మాధవ్, శ్యామ్‌సుందర్, ముఠా పద్మ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి, బైక్ ర్యాలీ..

రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్థూపానికి మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉద్యమకారులను సత్కరించిన ఆయన కార్యకర్తలతో కలిసి నియోజకవర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస్, మల్లేష్, సిరిగిరి శ్యామ్, కల్వగోపి, ప్రవర్ధన్‌రెడ్డి, కార్తీక్‌యాదవ్, కిరణ్, వెంకటేష్ పాల్గొన్నారు. రాంనగర్ ఈ సేవా వద్ద బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అస్లాం, వెంకట్‌రామ్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, గురుదీప్, శ్రీకాంత్, హమ్మద్, శివానంద్, ముస్తఫాలు బైక్ ర్యాలీ నిర్వహించారు.

రూబి స్టీవెన్‌సన్‌కు సత్కారం

అంబర్‌పేట: తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన ఉద్యమకారులకు టీఎన్జీఓ నేతలు ఘనంగా సత్కరించారు. గురువారం అంబర్‌పేటకు చెందిన ఉద్యమకారులు రూబి స్టీవెన్‌సన్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్ హుస్సేని తదితరులు కలిసి సన్మానించారు.

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

అంబర్‌పేట: తెలంగాణ ఉద్యమంలో అమరవీరుల పాత్ర చిరస్మరణీయమని బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ పులిజగన్, నాయకులు నాగేష్‌గౌడ్, సులోచనరెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, జీవన్‌గౌడ్, మాధవ్‌రెడ్డి, డీవీ రమణ, జనార్దన్ పాల్గొన్నారు.

కవాడిగూడలో..

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడు, ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్‌కు చెందిన ఉన్నితోటకు చెందిన వల్లాల రవియాదవ్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురువారం కవాడిగూడలో ఘనంగా శాలువాతో సత్కరించారు.



మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో..



ఎమ్మెల్యేతో వల్లాల రవియాదవ్



గజ్జల సూర్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం



రూబి స్టీవెన్‌సన్‌ను సత్కరిస్తున్న టీఎన్జీఓ సంఘం నాయకులు



సభకు బైక్ ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు



అడిక్‌మెట్ నుంచి బీఆర్ఎస్ సభకు సయ్యద్ అస్లాం ఆధ్వర్యంలో..



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న సుధాకర్‌రెడ్డి

సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



చిక్కడపల్లిలో అల్పాహారం, పండ్లను పంపిణీ చేస్తున్న కందూరి కృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సామాజిక వేత్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కందూరి కృష్ణ అన్నారు. గురువారం చిక్కడపల్లిలో దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మణిక్‌లాల్ జీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 1500 మంది పేదలు, విద్యార్థులకు అల్పాహారం, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. సమాజ హితం కోసం పని చేసే వారికి ఎప్పుడూ మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రమోద్ అగర్వాల్, హైకోర్టు అడ్వకేట్స్ హెచ్.గోవింద్‌రావు, కె.కౌశిక్, జ్వాలా వాలిని తదితరులు పాల్గొన్నారు.

25న మున్నూరుకాపుల ఆత్మగౌరవ మహాధర్నా

కాచిగూడ: మున్నూరుకాపుల సంక్షేమం, అభ్యున్నతికి ప్రత్యేకంగా మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మున్నూరుకాపు బంధును ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బలహీన వర్గాల సమితి అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం నాయకుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ తెలిపారు. 23 శాతం ఉన్న మున్నూరుకాపులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూపునకు మార్చాలని, ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని అన్నారు. మున్నూరుకాపు కులవృత్తులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏరువాక పౌర్ణమి పండగను తెలంగాణ రాష్ట్ర రైతు పండగగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించి అధికారికంగా జరపాలని అన్నారు. 300 మంది మున్నూరుకాపులతో నిర్వహించే మహాధర్నా కార్యక్రమంలో మున్నూరుకాపులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

దేశ అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- జోరుగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం

అంబర్‌పేట: దేశంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అనేక పథకాలు ప్రజలకు పారదర్శకంగా చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ చేపట్టిన మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం గోల్నాకలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు అందించారు. కేంద్రప్రభుత్వం పేదల అభివృద్ధితో పాటు దేశ సమగ్ర అభివృద్ధికి నిర్మాణాత్మకంగా కృషి చేస్తుందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ బి.వెంకట్‌రెడ్డి, గోల్నాక డివిజన్ కన్వీనర్ మూల రవీందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, ఈశ్వర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపరుస్తాం: డాక్టర్ కె.లక్ష్మణ్

చిక్కడపల్లి: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అవినీతి అక్రమాలు కుటుంబపాలనపై ప్రజలను చైతన్యపరుస్తామని బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం గాంధీనగర్ డివిజన్ బూత్ నంబర్: 131, 132, 133లోని శ్రీ స్వామి వివేకానందనగర్ బస్తీలో కార్పొరేటర్ పావనీ బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరుస్తామన్నారు. ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా 3 కోట్ల పేద కుటుంబాలకు పక్కా ఇల్లు నిర్మించామన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అచరణ సాధ్యంకాని పథకాలు, కార్యక్రమాలు చేపడుతూ, ప్రజలను మోసం చేస్తోందని, ఎలాగైనా తిరిగి మరోసారి అధికారంలోకి రావడానికి కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం ఈనెల 30 వరకు కొనసాగుతుందని, బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రభుత్వ పథకాలను వివరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నా సాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, సత్తిరెడ్డి, ముత్యాలు, విష్ణు ప్రసాద్, నర్సింహ, భారత్, సత్యం, ఆనంద్‌రావు, ప్రకాష్‌యాదవ్ పాల్గొన్నారు.



గోల్నాకలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



గాంధీనగర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ పావనీ

రాంనగర్‌లో..

ముషీరాబాద్: ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా రాంనగర్ డివిజన్ శివస్థాన్‌పూర్‌లోని 178వ బూత్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.



బీజేపీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవిచారి

అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని గురువారం సీఐటీయూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నగర కార్యదర్శి ఎం.దశరథ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూముల్లో అనేక సంవత్సరాల నుంచి ఉంటున్న పేద ప్రజలు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీవో నెంబర్ 58 కింద దరఖాస్తు చేసుకోవడం జరిగిందని వాటిని పరిశీలించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక పోరాటాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కొంత మందికి మాత్రమే ప్రభుత్వం పట్టాలిచ్చి చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. ఈ ధర్నాలో రమేష్, వెంకటమ్మ, పుల్లారావు, ఏ.కె.పాషా, యూసుఫ్ పాల్గొన్నారు.

హింస, క్రూరత్వం, ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హింస, క్రూరత్వం, ఆధిపత్యానికి వ్యతిరేకంగా కలిసి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొ. రమమెల్కొటే పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పీఓడబ్ల్యూయూ అర్ధ శతాబ్ది వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో కన్నా నేడు సమాజంలో వచ్చిన మార్పులతో అనేక నేరాలు, హింస పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు సైతం నేరస్తులుగా మారుతున్నారని పిలల్ని చంపడం, ఆత్మహత్యలు చేసుకోవడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. జాతీయ కన్వీనర్ సంధ్య మాట్లాడుతూ.. గత 50 సంవత్సరాలుగా ప్రగతి శీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూయూ) మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందన్నారు. అరుణోదయ సమైఖ్య అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ.. స్వేచ్ఛ, తమ ఆత్మగౌరవం కోసం స్త్రీలు సంఘటితంగా జరిపిన పోరాటాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. అణచివేతలు, దోపిడీ, హింస నుంచి స్త్రీలను విముక్తి చేయడం కోసం మరిన్ని పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళా ఉద్యమకారులు, ప్రజాస్వామిక వాదులపై పెట్టిన ఉపా కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ, సంధ్య, స్వరూప, అంబిక, లక్ష్మి, అనురాధా, వరలక్ష్మి, సరళ, కాత్యాయని, స్వరూప పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ముషీరాబాద్: జీవో 58 కింద దరఖాస్తు చేసుకున్న పేదలందరికి ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరణ చేసి వెంటనే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక డిమాండ్ చేసింది. గురువారం ముషీరాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటి కార్యదర్శి ఎం.వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న పేదలకు రేషన్ కార్డులు, వాటర్ బిల్లులు, ఆధార్ కార్డు, కరెంటు బిల్లుల వంటి అన్ని ఆధారాలు ఉన్నాయని వెంటనే ఆ స్థలాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విమల, బాబన్న, ఆంజనేయులు, నరేష్, మహేష్ పాల్గొన్నారు.

దేవాలయానికి ద్వారాల విరాళం

ముషీరాబాద్: రాంనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో గల శివాలయానికి ఆర్యవైశ్య సంఘం రాంనగర్, జాపాల విజయలక్ష్మి, జాపాల విశ్వేశ్వరచారి, సృజన ద్వారాలను విరాళంగా అందజేశారు. గురువారం ఈ ద్వారాల ప్రారంభోత్సవం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గుప్తా, ఆలయ ఈవో పి.లక్ష్మారెడ్డి, ఆలయ చైర్మన్ డి.రవీందర్‌యాదవ్, ధర్మకర్తలు శ్రీధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అర్చకులు ఏ.వెంకటరమణచార్యులు, వేణుగోపాలచార్యులు, ప్రతాప్‌శర్మ పాల్గొన్నారు.



ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అమరుల త్యాగాలు మరువలేనివి

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నగరంలోని లుంబినీ పార్కులో అమరవీరుల స్మారక స్థూపాన్ని ప్రారంభించిన సందర్భంగా తెలంగాణ అమరవీరులకు రంగారెడ్డి జిల్లా న్యాయవాదులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అమరులైన అమరవీరులకు తెలంగాణ సమాజం రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సీనియర్ న్యాయవాది ఎం.రఘునందన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు జి.రామారావు, ఎల్.హరీష్, జె.భాస్కర్, జి.సుధాకర్‌రెడ్డి, సదానందం, విప్లవ్, రమేష్‌రెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాంచందర్ శుభాకాంక్షలు కాంగ్రెస్ నేతలు

జన్మదిన శుభాకాంక్షలు

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రాంచందర్ జన్మదిన సందర్భంగా గురువారం ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఏఐసీసీ ఫిషర్ మెన్ కమిటీ సభ్యులు బిజ్జి శత్రువు, రాష్ట్ర నాయకులు కన్నా డానియల్, శ్రీరాములయాదగిరి, శ్రీకాంత్, విజయ్ యాదవ్, సురేష్, అంజయ్య కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఓయూలో ఏడు మెట్ల బావులు



జ్యోతి వెలిగిస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూ విస్తీర్ణంలో ఏడు మెట్లబావులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. క్యాంపస్‌లోని బీఈడీ కాలేజీలోని పురాతన మెట్లబావిని కాలేజీతో పాటు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరమ్మతులు చేపట్టి సుందరీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. నీటి అవసరాల కోసం మెట్ల బావులను పునరుద్ధరించుకోవాలన్నారు. వచ్చే ఏడాది మరో రెండు మెట్ల బావులకు మరమ్మతు చేయించనున్నట్లు తెలిపారు. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, కల్పన రమేష్, ప్రొ.గోపాల్‌నాయక్ పాల్గొని ప్రసంగించారు.

విష్ణుకు వీసీ పరామర్శ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని వివిధ హాస్టల్స్ భవనాల చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని వీసీ ప్రొ.రవీదర్ ఆదేశాలు జారీ చేశారు. పాముకాటుతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పీహెచ్‌డీ విద్యార్థి విష్ణును గురువారం వీసీతో పాటు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు పరామర్శించారు. విష్ణు ఆరోగ్యం నిలకడగా ఉండడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. హాస్టల్ పరిసరాల్లో చీకటిగా ఉండే ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.



విష్ణును పరామర్శిస్తున్న ఓయూ అధికారులు

'విద్యార్థుల ఆందోళన అర్థరహితం'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని నిజాం కాలేజీ ఐదేళ్ల ఎమ్మెస్సీ విద్యార్థులు గత పది రోజులుగా చేస్తున్న ఆందోళన అర్థరహితమని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ కోర్సు రద్దుతో ప్రస్తుతం చదివే విద్యార్థులకు ఎలాంటి నష్టం లేదన్నారు. ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు శాశ్వత కోర్సు కాదని, సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాతిపదికన ప్రవేశపెట్టారని మారిన పరిస్థితులకు అనుకూలంగా మార్కెట్ అవసరాలను బట్టి కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం, తొలగించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకోకుండా ఆందోళనను విరమించుకోవాలన్నారు.